04-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - జ్ఞాన సాగరుడైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలంటే 20 గోళ్ళ బలాన్ని (పూర్తి శక్తిని) ఉపయోగించి అయినా చదువును తప్పకుండా చదవండి, చదువు ద్వారానే రాజ్యము మరియు జీవన్ముక్త పదవి లభిస్తుంది"

ప్రశ్న:- జ్ఞాన మార్గంలో సదా స్థిరంగా ఎవరు ఉండగలుగుతారు? ఉన్నత పదవి యొక్క ప్రాప్తికి ఆధారము ఏమిటి?

జవాబు:- ఎవరికైతే చదువు తప్ప ఇంకే విషయంపైనా అభిరుచి ఉండదో, ఎవరికైతే జ్ఞానము యొక్క పరిపక్వ స్థితి ఉంటుందో, వారే ఈ జ్ఞాన మార్గంలో స్థిరంగా ఉండగలుగుతారు. అంతేకానీ ధ్యానము, సాక్షాత్కారాల పట్ల ఆశను పెట్టుకోవడము, ఆట-పాటలలో గడపడము, వీటివల్ల లాభమేమీ లేదు, మాయ ఇంకా ఎక్కువ ప్రవేశిస్తుంది, అప్పుడిక తండ్రి చేతిని మరియు చదువును వదిలేస్తారు. ఉన్నత పదవి కొరకు చదువుపై పూర్తి అటెన్షన్ ఉండాలి.

పాట:- నీవే తల్లివి, నీవే తండ్రివి... (తుమ్హీ హో మాతా, తుమ్హీ హో పితా...)

ఓం శాంతి. ఓం శాంతి అర్థాన్ని పిల్లలకు వివరించడం జరిగింది. ధార్మిక మనస్కులు లేక ధర్మాత్ములైన వ్యక్తులు ఎవరైతే ఉంటారో, మందిరాలకు, ధార్మిక స్థలాలకు ఎవరైతే వెళ్తారో, వారి నోటి నుండి ఓంశాంతి అన్న పదము వెలువడుతుంది. కానీ వారికి దాని అర్థం తెలియదు. మనం కూడా ఓం శాంతి అంటాము అనగా అహం ఆత్మ (నేను ఆత్మను). ఆత్మ అన్న పదము తప్పకుండా వస్తుంది. పరమాత్మ మరియు ఆత్మ ఓం శాంతి అని అంటారు. నేను ఆత్మను, నా స్వధర్మము శాంతి. ఆత్మ తన వృత్తి గురించి చెప్తుంది. తండ్రి కూడా ఓం శాంతి అని అంటారు. నేను కూడా ఆత్మనే, కానీ నన్ను పరమాత్మ అంటారు ఎందుకంటే నేను ఎల్లప్పుడూ పరంధామంలో ఉంటాను. నేను జనన-మరణాలలోకి రాను. తండ్రి సమ్ముఖంగా వచ్చి చెప్తున్నారు - మీరు పునర్జన్మలలోకి వస్తారు, మీరు దేహధారులు. సూక్ష్మవతనం వారు కూడా సూక్ష్మ దేహధారులే. నేను వీరందరి కన్నా అతీతమైనవాడిని. నాకు స్థూల దేహమేమీ లేదు. వీరు బ్రహ్మా, వీరు విష్ణువు, వీరు శంకరుడు అని సూక్ష్మ శరీరధారులను అంటారు. పేరైతే శరీరానికే కదా. ఆత్మకైతే ఉండదు. ఆత్మ శరీరాన్ని ధారణ చేస్తుంది, అప్పుడే శరీరానికి పేరు పెట్టబడుతుంది. ఎవరైనా మరణిస్తే ఫలానావారు శరీరము వదిలేసారు అని అంటారు. పేరైతే ఆ శరీరానికే ఉండిపోతుంది, మళ్ళీ ఇంకొక శరీరాన్ని తీసుకుంటారు. పరమపిత పరమాత్ముని విషయంలో - వారు ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని తీసుకుంటారు అని అనరు. అందరికీ శరీరానికి పేరు పెట్టబడుతుంది. పిల్లలైన మీరు నా వారిగా అయ్యాక మీకు కూడా వేరే పేరు పెడతాను. ఏ విధంగా గురువులు పేర్లు పెడతారు కదా. ఈ రోజుల్లో కన్య వివాహం చేసుకుంటే ఆమెకు కూడా పేరు మారుతుంది. పురుషుని పేరు మారదు ఎందుకంటే పురుషుడు తన పేరుతో వ్యాపారం చేయాల్సి ఉంటుంది. మాతలకైతే వ్యాపారాలు ఉండవు, అందుకే వారి పేరు మారవచ్చు. పురుషులకు బీమాలు, వ్యాపారాలు మొదలైనవాటిలో పేరు ఉంటుంది. ఇప్పుడు తండ్రి అర్థం చేయిస్తారు - నీవే తల్లి-తండ్రివి, సహచరుడివి, నావికుడివి, నీవు మమ్మల్ని నీతో పాటు తీసుకువెళ్తావు అంటూ అందరూ తలచుకుంటారు. చూడండి, ఎన్ని సంబంధాలలో వస్తారు. శరీరాన్ని వదిలి ఇక మీతోపాటు వెళ్ళాలి అని అంటారు. నావికుడు మనల్ని తనతోపాటు తీసుకువెళ్తాడని పిల్లలైన మీకు తెలుసు.

తండ్రికి ఎంత మహిమ ఉంది! వారు మళ్ళీ ఎప్పుడు వస్తారు? ఎప్పుడు వచ్చి సహచరునిగా అవుతారు? ఇది తెలియదు. ఎప్పుడైతే భక్తి మార్గము అంతమవుతుందో, అప్పుడు భక్తుల రక్షణ చేసేందుకు నేను రావాల్సి ఉంటుంది. నేను నావికునిగా అయి తిరిగి తీసుకువెళ్ళాలి. వారు ఏ విధంగా వచ్చి మాతా-పితలుగా అయ్యారు అన్నది మీకు తెలుసు. వీరినే నావికుడు, గురువు అని అంటారు. వీరు ఛీ-ఛీ ప్రపంచము నుండి, జీవన బంధనం నుండి జీవన్ముక్తిలోకి తీసుకువెళ్తారు, అందుకే వారిని పతిత-పావనుడు, నావికుడు అని అంటారు. సత్యయుగాన్ని కొత్త ప్రపంచము అని అంటారు. ప్రపంచమైతే ఇదే, కేవలం పాత ప్రపంచ వినాశనం జరుగుతుంది. ఏ విధంగా పాత ఇంట్లో ఉంటూ కొత్తదానిని నిర్మించుకుని ఇక పాత ఇంటిని విడిచిపెట్టాల్సి ఉంటుంది కదా, అలాగే ఇది కూడా ఎప్పుడైతే స్థాపన అవుతుందో అప్పుడు పాత ప్రపంచ వినాశనం జరుగుతుంది. త్రిమూర్తి అర్థాన్ని కూడా అర్థం చేయించారు. బ్రహ్మ ద్వారా స్వర్గ స్థాపనను చేయడము - ఇది పరమపిత పరమాత్ముని పనే. వారి ద్వారా చేయిస్తారు ఎందుకంటే వారు చేసేవారు మరియు చేయించేవారు. తండ్రి వచ్చి సమ్ముఖంగా అర్థం చేయిస్తారు. బ్రహ్మ ద్వారా సహజ రాజయోగాన్ని మరియు

జ్ఞానాన్ని బ్రహ్మ ముఖవంశావళి అయిన మీకు కూర్చుని నేర్పిస్తాను. భవిష్య 21 జన్మల కొరకు మీరే దేవీ-దేవతా పదవిని పొందుతారు, నంబరువారు పురుషార్థానుసారంగా.

మనము మాతా-పితల ద్వారా చదువుకుంటున్నామని మీకు తెలుసు, ఇది ఈశ్వరీయ విశ్వవిద్యాలయము. ఒకవేళ చదువును వదిలేస్తే వీరి భాగ్యములో లేదని భావించడం జరుగుతుంది. స్కూల్ అయితే తప్పకుండా నడుస్తుంది. బాబా వచ్చి ఈ బ్రహ్మ తనువు ద్వారా చదివిస్తారు. కావున పిల్లలు ఎక్కడ ఉన్నా కానీ, ఏ సెంటర్లో ఉన్నా కానీ, జ్ఞాన సాగరుడైన పారలౌకిక పరమపిత పరమాత్మ ద్వారా తాము జీవన్ముక్తి మరియు రాజ్య వారసత్వాన్ని పొందాలని వారికి తెలుసు. ఒకవేళ మనం చదువును వదిలేస్తే వారసత్వాన్ని పొందలేకపోతాము. తండ్రి అయితే తమతోపాటు తీసుకువెళ్ళేందుకు వచ్చారు. కొత్త ప్రపంచ స్థాపన జరుగుతుంది, అప్పుడు నావికుడు అందరినీ తీసుకువెళ్తారు. మీకు నావికుని గురించి తెలుసు మరియు ఎవరి ద్వారానైతే స్థాపన, వినాశనము, పాలనను చేయిస్తారో, వారి గురించి కూడా మీకు తెలుసు. అలాగే ఈ చదువు ద్వారా ఎవరైతే లక్ష్మీ-నారాయణులుగా అయి రాజ్యం చేస్తారో వారి గురించి కూడా మీకు తెలుసు. మేము తప్పకుండా ఈ చదువు ద్వారా రాజ్యపదవిని ప్రాప్తి చేసుకుంటున్నామని మీరు భావిస్తారు. ఎవరు ఎంత చదివితే అంత... చదువును చదవకపోతే పదవి భ్రష్టమవుతుంది. ఇది రాజయోగము యొక్క చదువు. చాలామంది పిల్లలు చదువును చదువుతూ-చదువుతూ అలసిపోతారు. చదవకపోవడము అనగా అలసిపోవడము. చాలు, ఇక మేము చదవలేము అని అంటారు. ఈ చదువులో ఖర్చు విషయమైతే లేదు. ఆ చదువులో పాపం పేదవారు చదువుకు ధనం ఇవ్వలేకపోతే చదువునే వదిలేస్తారు. కానీ ఎవరికైతే చదువు పట్ల బాగా అభిరుచి ఉంటుందో వారు - మేము చదువుకోవాలనుకుంటున్నాము కానీ ధనం లేదు అని గవర్నమెంటుకు అప్లై చేస్తారు. అప్పుడు గవర్నమెంటు వారికి ధనం ఇస్తుంది. నేను చదువుకోవాలనుకుంటున్నాను, మా తండ్రి వద్ద ధనం లేదు, నాకు సహాయం చేయండి అని ఎలాగైనా రిక్వెస్ట్ చేస్తారు. గవర్నమెంట్ వద్ద ధనం లేని కారణంగా తిరస్కరిస్తుంది. నేనైతే తప్పకుండా చదవాలి అని భావిస్తారు, అప్పుడేం చేస్తారు? పెద్ద షావుకారులు లేక దాతల వద్దకు వెళ్తారు. నా మాతా-పితలు పేదవారు, నేను చదువుకుని సేవ చేయాలనుకుంటున్నాను, మీరు నాకు సహాయం చేయగలరా అని అడుగుతారు. ధార్మిక మనసున్నవారు సహాయం చేస్తారు. కన్యలు ఈ విధంగా రిక్వెస్ట్ చేయలేరు, పురుషులే చేయగలరు. చదువు ద్వారా సంపాదన ఎంతగానో లభిస్తుంది. ఇక్కడ ఇది చదువు కూడా మరియు ఇది వ్యాపారము కూడా. తండ్రి వ్యాపారి, రత్నాకరుడు, అలాగే జ్ఞాన సాగరుడు కూడా.

మాతా-పిత అయిన అనంతమైన జ్ఞానసాగరుడు అంటున్నారు - నేను కల్పపూర్వం వలె మీకు రాజయోగాన్ని నేర్పించి రాజులకే రాజులుగా చేస్తాను. అన్ని పాయింట్లను ధారణ చేయాలి. పరిపక్వ బుద్ధి కలవారు చక్కగా ధారణ చేయగలుగుతారు. బుద్ధి పైనే అంతా ఆధారపడి ఉంది. కొందరిది సతోప్రధాన, కొందరిది సతో, కొందరిది రజో, కొందరిది తమో బుద్ధి. ఆ స్కూల్లో కూడా విద్యార్థులకు - ఫలానావారి బుద్ధి ఎలా ఉందో తెలిసి ఉంటుంది. సతోప్రధాన బుద్ధికలవారు పాస్ విత్ ఆనర్ గా అవుతారు. వారినే లీడర్ మొదలైనవారిగా చేస్తారు. స్కాలర్షిప్ కూడా లభిస్తుంది. అలాగే ఇది అనంతమైన స్కూలు. ఇందులో కూడా సతో, రజో, తమో బుద్ధి ఉంటుంది. ఇక్కడ పదవి ఒక్కటే. ఇది రాజయోగము. ఈశ్వరీయ చదువు ఒక్కటే. తండ్రి అంటారు, నేను పిల్లలైన మీ అందరికీ రాజయోగాన్ని నేర్పిస్తాను. కావున ఎంతగా పురుషార్థం చేస్తారో అంతగా ఉన్నత పదవిని పొందుతారు. ఉన్నత పదవి గురించైతే అర్థం చేసుకున్నారు. నంబరువారుగా పదవిని పొందుతారు. తండ్రికైతే అందరిపైనా ప్రేమ ఉంది. వారు అందరినీ మాయావీ సంకెళ్ళ నుండి విడిపించేందుకు వచ్చారు. కల్ప-కల్పమూ నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను అని ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. తండ్రియే అంటారు - కల్ప-కల్పము, కల్పము యొక్క సంగమయుగంలో నేను వస్తాను. మనుష్యులేమో యుగే-యుగే అని వ్రాసి ఎంత పొరపాటు చేసారు. తండ్రి అంటారు, నేను పతిత-పావనుడిని. నేను కలియుగాంతము మరియు సత్యయుగ ఆది యొక్క సంగమములో మిమ్మల్ని పావనంగా తయారుచేసేందుకే వస్తాను. ఈ సమయంలో బాబా వచ్చి ఉన్నారు కావున బాగా చదువుకోవాలి, వినాశనం కూడా జరగనున్నది. 20 గోళ్ళ బలాన్ని (పూర్తి శక్తిని) ఉపయోగించి చదువుకోవాలి, ధైర్యము చూపించాలి. చదువును వదిలేయకూడదు. ఎవరైతే చదువును వదిలేస్తారో వారు ఫెయిల్ అయి పడిపోతారు. పిల్లలను అప్రమత్తం చేయడం జరుగుతుంది. ఏ విధమైన కామము లేక క్రోధము లేక లోభ, మోహముల భూతము రాకూడదు. హృదయం రూపీ దర్పణంలో చూసుకుంటూ ఉండండి - లక్ష్మిని వరించేందుకు నేను యోగ్యుడినా? నారదుని ఉదాహరణను కూడా ఒకటి చూపించారు. మీరందరూ భక్తులే కదా. భక్తి మార్గంలో పురుషులలో నారదుడు ఉత్తమునిగా గాయనం చేయబడ్డారు మరియు స్త్రీలలో మీరా. అది భక్తి మార్గము. జ్ఞాన మార్గంలో చూసినట్లయితే మమ్మా, బాబా యొక్క పేరు ప్రఖ్యాతమైంది. వారి విజయమాల కూడా

తయారుచేయబడి ఉంది. ఎవరైతే సుఖాన్ని ఇస్తారో వారినే స్మరించడం జరుగుతుంది. వారి స్మృతిచిహ్నాలను తయారుచేస్తారు. ఇప్పుడు ఇంతకీ వారు ఏం చేసారు? ఎవరైనా మహా అయితే కాలేజ్ ను తెరిచి ఉంటారు, దానపుణ్యాదులను బాగా చేసి ఉంటారు, ఇంకేం చేస్తారు? ఇప్పుడు ఆంగ్లేయుల నుండి రాజ్యము తీసుకుని కాంగ్రెస్ వారు రాజ్యం చేసారు. తండ్రి అంటారు, ఇది కేవలం మృగతృష్ణ వంటి రాజ్యము. ఎన్ని సుఖాలు ఉన్నా కానీ ఇవన్నీ మృగతృష్ణ వంటివే. బాహ్య ఆర్భాటం ఎంతగానో ఉంది. ఈ సైన్స్ కూడా 100 సంవత్సరాలు కొనసాగుతుంది. ఈ దాదా బొంబాయిలో పని చేసే సమయంలో ఈ కరెంటు, టెలిఫోన్ మొదలైనవేవీ లేవు. ఇప్పుడు సైన్స్ ఎంత అద్భుతము చేసింది. ఇప్పుడు ఇంకా కొన్ని సంవత్సరాలే ఉన్నాయి. సైన్స్ అహంకారము 100 సంవత్సరాల నుండి ప్రారంభమయ్యింది. సత్యయుగం యొక్క 100 సంవత్సరాల్లో ఏమి చేస్తారో తెలియదు. అక్కడ ఈ వస్తువులన్నింటిలోనూ బలం ఉంటుంది, దానిని మీరు ఇక్కడి నుండి తీసుకువెళ్తారు. అఖండమైన, స్థిరమైన, సుఖ-శాంతిమయమైన రాజ్యాన్ని పరిపాలించేందుకు మీరు బలాన్ని తీసుకువెళ్తారు. కావున చదువుపై ఇంత అటెన్షన్ ఉంచాలి, ఇంత పురుషార్థం చేయాలి.

మీకు తెలుసు, ఈ మాతా-పితల ద్వారా అపారమైన సుఖాలు లభిస్తాయి, కానీ ఒకవేళ నడుస్తూ-నడుస్తూ వీరిని వదిలేసినట్లయితే అసలు ఏమీ విననట్లే లెక్క. ఏమీ వినకుండా వెళ్ళి తమ వ్యాపార-వ్యవహారాల్లో నిమగ్నమైపోతే ఇక అంతమైపోతారు, ఇక ఎంత పొందితే అంత పొందినట్లు. చేతిని విడిచిపెట్టిన తర్వాత ఇక మాయ పూర్తిగా మింగేస్తుంది. ఏనుగును మాయా మొసలి మింగేసింది. ఇది జరగవలసిందే. మంచి-మంచి, పెద్ద-పెద్ద ఆహ్వానాలను ఇచ్చేవారు, సెంటర్లను తెరిచేవారు కూడా చదువును ఏ విధంగా వదిలేస్తారు అనేది మీరు చూస్తారు కూడా. డ్రామా అనుసారంగా వీరి భాగ్యంలో ఇంతే ఉంది అని అంటారు. అప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది? మాయ పూర్తిగా తినేస్తుంది. ఎంతమంది అంతమైపోయారు. ధ్యానములోకి ఎంతగానో వెళ్ళేవారు, ఆట-పాటలు ఆడేవారు ఈ రోజు లేరు. ఈ ధ్యానము-సాక్షాత్కారాల యొక్క ఆశను ఎప్పుడూ పెట్టుకోకూడదు. ఆశ పెట్టుకున్నట్లయితే ఆ ఆశలో విఘ్నాలు కలుగుతాయి. మాయ భూతాలు కూడా ప్రవేశిస్తాయి. ధ్యానము యొక్క పాత్రను ఎంతగా అభినయించేవారు. ఎవరైతే 5-7 రోజుల వరకూ ధ్యానంలో బాల్యపు పాత్రలో ఉండేవారో, మహారాణిగా అయ్యేవారో, ఈ రోజు వారు లేరు. దీని వల్ల లాభమేమీ లేదు. జ్ఞానము యొక్క పరిపక్వ అవస్థ కలిగినవారే నిలిచి ఉండగలరు. ఎప్పుడూ కూడా ధ్యానములోకి వెళ్ళే ఆశను పెట్టుకోకూడదు. బాబా ఏదైతే చదివిస్తారో, దానిని ధారణ చేయాలి. ఎంతగా చదువుకుంటారో, అంతగా ఉన్నత పదవిని పొందుతారు. మమ్మల్ని పరమపిత పరమాత్మ చదివిస్తున్నారు అని పిల్లలైన మీరు కూడా గుర్తుంచుకోవాలి. మనం చదువుకుని 21 జన్మల కొరకు ఉన్నత పదవిని పొందుతాము, మళ్ళీ మనమే పూజ్యుల నుండి పూజారులుగా అవుతాము. ఎవరైతే బ్రాహ్మణ కులానికి చెందినవారిగా అవుతారో వారే ఇలా చెప్పగలరు, ఇంకెవ్వరూ ఇలా చెప్పలేరు. భారత్ యొక్క ఆటే రచింపబడి ఉంది. మేమే పూజ్యులైన దేవీ-దేవతలుగా అవుతాము అని మీరు అంటారు. పూజ్యులే మళ్ళీ పడిపోయి పూర్తి 84 జన్మలను తీసుకుంటారు. పిల్లలకు ఇవన్నీ తెలుసు. శివబాబా కర్తవ్యము గురించి కూడా మీకు తెలుసు. ఒక్క క్షణంలో నిశ్చయం ద్వారా మీరు వారసత్వాన్ని తీసుకోవచ్చు. మేము ఈశ్వరునికి చెందినవారిగా అయ్యాము అని అంటారు, మళ్ళీ ఆ ఈశ్వరుడిని వదిలేయడము అంటే, ఇది ఆశ్చర్యము కదా. స్కూల్లో చదువుకుంటారు, మంచి నంబరులో పాస్ అయితే అతడిని సుపుత్రునిగా భావిస్తారు. ఆ విద్యార్థి తనను తాను కూడా సుపుత్రునిగా భావిస్తాడు. తండ్రి మరియు టీచర్ కూడా - ఇతను సుపుత్రుడు అని అంటారు. ఇక్కడైతే తండ్రి, టీచర్, గురువు ఒక్కరే. వీరు తండ్రి కూడా, అలాగే టీచర్ గా అయి మనల్ని చదివిస్తారు, మళ్ళీ తమతోపాటు తీసుకువెళ్తారు కూడా. తండ్రి అంటారు, మనం తోడుగా కలిసి వెళ్తాము. ఇంతకుముందు మీ జ్యోతి ఆరిపోయింది, ఇప్పుడు వెలుగుతోంది. నా జ్యోతి సదా వెలిగే ఉంటుంది. ఇదంతా ఆత్మ విషయమే. మీకు తెలుసు, ఆత్మ అయిన మనం అశరీరిగా వచ్చామని, మళ్ళీ అశరీరిగా అయి వెళ్ళాలని. మన ఆట పూర్తి అయి మళ్ళీ రిపీట్ అవ్వనున్నది. పిల్లలైన మీకు బుద్ధిలో ఈ వివేకము ఉంది.

నీవే తల్లివి, తండ్రివి... నీవు చూపించే చదువు అనే కృప ద్వారా మాకు అపారమైన సుఖాలు ఎంతగా లభిస్తాయి. ఇటువంటి మాతా-పితలను ఎప్పుడూ మర్చిపోకూడదు, వదలకూడదు. తండ్రి అంటారు, ఇటువంటి మాతా-పిత, బాప్ దాదా, ఎవరైతే మీకు ఇంతటి వారసత్వాన్ని ఇస్తారో, వారికి ఉత్తరం వ్రాస్తూ ఉంటే - వీరు స్మృతి చేస్తున్నారు అని బాబా భావిస్తారు. బాబా ప్రియ స్మృతులైతే రోజూ మురళీ ద్వారా వెళ్తూనే ఉంటాయి. పిల్లల ఉత్తరం ఆలస్యంగా వస్తే - వీరు పూర్తిగా స్మృతి చేయడం లేదని తండ్రి భావిస్తారు. తండ్రికైతే వ్రాయవలసిన అవసరం లేదు. తండ్రి నుండైతే రోజూ మురళి వెళ్తూ ఉంటుంది. ప్రియస్మృతులను బాబా ఇస్తూనే ఉంటారు. వారు వెలుగుతూ ఉన్న జ్యోతి. ఉత్తరాలు తప్పకుండా

వ్రాస్తూ ఉండండి అని పిల్లలకు అర్థం చేయిస్తారు. అనన్యులైన పిల్లల విషయంలో చింత ఉండదు. కదిలిపోతూ ఉండేవారికి అప్రమత్తం చేయడం జరుగుతుంది -మర్చిపోకండి, చదువుతూ ఉండండి అని. సమాచారాలైతే బాబా వద్దకు అన్నీ వస్తాయి కదా. రిజిస్టరులో పేరు నమోదై ఉంటుంది. కావున ఈ బిడ్డ ఎందుకు ఆబ్సెంట్ అని అడుగుతారు. రోజు ఆబ్సెంట్ అయితే మరణించాడు అని భావించడం జరుగుతుంది. బాబా అడుగుతారు - ఫలానా బిడ్డ నుండి ఏ సమాచారమూ రాలేదే? అప్పుడు - ఫలానావారు ఇప్పుడు అసలు రావడం లేదు, సంశయబుద్ధి కలవారిగా అయ్యారు అని వ్రాస్తారు. అచ్ఛా, మున్ముందు బహుశా నిశ్చయబుద్ధి కలవారిగా అవుతారేమో. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. విజయమాలలోకి వచ్చే ధైర్యాన్ని చూపించాలి. స్మరణ యోగ్యులుగా అయ్యేందుకు అందరికీ సుఖాన్ని ఇవ్వాలి.

2. సుపుత్రులైన విద్యార్థులుగా అయి తండ్రి మరియు టీచర్ పేరును ప్రసిద్ధి చేయాలి. ఎప్పుడూ కూడా కామము లేక క్రోధము అనే భూతాలకు వశమై తప్పుడు పనులు చేయకూడదు.

వరదానము:- చేసేవారు మరియు చేయించేవారి స్మృతి ద్వారా విఘ్నాల బీజాలను సమాప్తం చేసి సమర్థ ఆత్మ భవ

అన్ని రకాల విఘ్నాల బీజాలు రెండు పదాలలో ఉంటాయి: 1 - అభిమానము, 2 - అవమానము. సేవా క్షేత్రంలో అయితే - నేను ఇది చేసాను, నేనే చేయగలను అన్న అభిమానము వస్తుంది లేదా నన్ను ఎందుకు ముందు ఉంచలేదు, నన్ను ఈ విధంగా ఎందుకు అన్నారు, ఇలా నన్ను అవమానపరిచారు అని అనుకుంటారు. ఈ భావనయే భిన్న-భిన్న విఘ్నాల రూపంలో వస్తుంది. మీరు ఈశ్వరీయ సేవాధారులు అన్నప్పుడు, చేసేవారు మరియు చేయించేవారు తండ్రి అన్నప్పుడు, అభిమానము ఎక్కడి నుండి వచ్చింది, అవమానము ఎక్కడి నుండి జరిగింది? అందుకే కంబైండ్ రూపపు స్మృతి ద్వారా సమర్థ ఆత్మలుగా అయినట్లయితే విఘ్నాల బీజాలు సదా కొరకు సమాప్తమైపోతాయి.

స్లోగన్:- జ్ఞాన స్వరూపులుగా అవ్వాలంటే తండ్రిపై మరియు చదువుపై సమానమైన ప్రేమ ఉండాలి.